సాక్షి నంద్యాల
మంగళవారం । 2 । ఏప్రిల్ । 2024



భారీ పుచ్చకాయ
హొళగుంద: సాధారణంగా పుచ్చకాయ 9 నుంచి 11 కిలోల వరకు ఉంటుంది. అయితే హొళగుందలో ఓ వ్యాపారి వద్ద 16 కేజీల పుచ్చకాయ సోమవారం కనిపించింది.



అలరించిన నాదామృతం
శ్రీశైలం టెంపుల్: నిత్యకళారాధన వేదికపై సోమవారం నెల్లూరుకు చెందిన జె. వెంకట సురేష్ బృందం నిర్వహించిన నాదామృతం కార్యక్రమం అలరించింది.



శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన
శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను వెండిరథంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

	ఇఫ్తార్	సహర్
కర్నూలు	సా॥ 6:35	ఉ॥ 4:46
ఆదోని	సా॥ 6:38	ఉ॥ 4:49
నంద్యాల	సా॥ 6:35	ఉ॥ 4:43
ఆత్మకూరు	సా॥ 6:33	ఉ॥ 4:44
బనగానపల్లె	సా॥ 6:36	ఉ॥ 4:44

రంజాన్ వేళలు

హదీస్ వెలుగు :
చాడీలు చెప్పడం, ఇద్దరి మధ్య గిల్లలు పెట్టి వారిని దూరం చేయడం, బంధువుల మధ్య సంబంధాలు తెంచడం చాలా పాపం. ఇలాంటి వాటి పట్ల దూరంగా ఉండండి. – పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

చలువ పందిళ్లు ఏర్పాటు



శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహా క్షేత్రంలో ఈ నెల 6 నుంచి 10వ తేది వరకు నిర్వహించే ఉగాది మహోత్సవాలకు తరలివచ్చే భక్తులు సేదతీరేందుకు క్షేత్ర పరిధిలో పలు చోట్ల చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. టోల్ గేట్ వద్ద బసవ వనం, సిబ్బంది వసతి గృహాల వద్ద ఉన్న బాలగణేశ వనం, పాతాళగంగామార్గంలోని శివదీక్షా శిబిరాలు, ఆలయ పుష్కరిణి వద్ద ఉన్న శ్రీపర్వత వనం, ఆలయ దక్షిణమాడవీధిలోని రుద్రాక్ష వనం, శివాజీగోపురానికి ఎదురుగా ఉన్న శివాజీ వనం మొదలైనచోట్ల ఈ చలువ పందిళ్లు వేయడంతో భక్తులు సేదతీరుతున్నారు. నల్లమల అటవీ మార్గంలోని వెంకటాపురం, నాగలూటి, దామర్లగుంట, పెద్దచెరువు, కైలాసద్వారం, మొదలైనచోట్ల దేవస్థానం చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తోంది.

నేటి నుంచి రెండు ప్యాసింజర్ రైళ్లు రద్దు
డోన్ రూరల్: గుంతకల్లు – కాచిగూడ మధ్య నడిచే రెండు ప్యాసింజర్ రైళ్లను మంగళవారం నుంచి రద్దు చేసినట్లు డోన్ రైల్వే స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ సమీపంలో డబుల్ లైన్ పనులు జరుగుతుండటంతో ఈనెల 30వ తేదీ వరకు కాచిగూడ నుంచి గుంతకల్లు వెళ్లే 07671 రైలు, గుంతకల్లు నుంచి కాచిగూడకు వెళ్లే 07670 ప్యాసింజర్ రైలు రద్దు అయినట్లు చెప్పారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలన్నారు.

ఉపాధి కూలీ వేతనం రూ. 300



పనులను పరిశీలిస్తున్న పీడీ రామచంద్రారెడ్డి

గోస్పాడు: 2024 – 25 ఆర్థిక సంవత్సరం నుంచి ఉపాధి హామీ పథకం కూలీల వేతనం రూ. 300కు పెరిగిందని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని ఎస్.నాగులవరం గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, ఒంటరి మహిళలు, వికలాంగులకు పనులు కేటాయించాలన్నారు. వారికి వంద రోజుల పనిదినాలు పూర్తయ్యేలా చూడాలని చెప్పారు. పని ప్రదేశంలో కూలీలకు నీడ కల్పించాలని, కూలీలందరికీ సగటు పని దినాలు కల్పించడంతో పాటు వారికి సక్రమంగా వేతనం అందేలా చూడాలన్నారు. కూలీలు వారికి నిర్దేశించిన కొలతల ప్రకారం పని కచ్చితంగా చేయాలని సూచించారు. అనంతరం ఉపాధి పనుల నిర్వహణ, పనులు చేయించాల్సిన విధానం, కూలీలకు వేతనాలు వచ్చే విషయంపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీఓ నాగజ్యోతి, ఈసీ మహేష్, ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాల ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ
నంద్యాల టౌన్: నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సీహెచ్ జయమ్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ నూతనంగా ప్రారంభించిన వైద్య కళాశాలలో విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తమమైన వైద్యులుగా తీర్చి దిద్దేందుకు, కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆమెకు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆనంద కుమార్, డాక్టర్ బాలీశ్వరి, అడ్మిన్ మోహన్ కృష్ణ, వివిధ విభాగాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

పింఛన్లకు పచ్చ సంకెళ్లు

- ఐదేళ్లుగా ప్రజా సేవలో తరించిన వలంటీర్లు
- ప్రజలకు దూరం చేసిన పచ్చ బ్యాచ్
- రేపటి నుంచి సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ
- వృద్ధులు, దివ్యాంగులు, రోగులకు తప్పని అగచాట్లు
- చంద్రబాబుపై మండిపడుతున్న పింఛన్ లబ్ధిదారులు

సచివాలయానికి వెళ్లేదెలా..
చిత్రంలో మంచం మీద ఉన్న వృద్ధురాలి పేరు పుల్లమ్మ. రుద్రవరం మండలం ఎల్లావత్తుల గ్రామం. ఆమెకు దాదాపు 85 ఏళ్ల వయస్సు ఉంది. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ప్రతి నెల పంచాయతీ కార్యాలయం వద్దకు నాలుగైదు రోజుల పాటు తిరిగి పడి గాపులు కాసి వృద్ధాప్య పింఛన్ సొమ్ము అందుకునేది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వలంటీరు ప్రతి నెల 1వ తేదీన తెల్లారక ముందే ఇంటి వద్దకు వచ్చి పింఛన్ సొమ్ము అందించేవారు. ఇప్పుడు వలంటీర్లు పంచడం లేదని గ్రామ సచివాలయం వద్దకే వెళ్లి పింఛన్ సొమ్ము తీసుకోవాలని ఆదేశాలు రావడంతో ఆమె ఆందోళన చెందుతోంది. వయోభారంతో కదల్లేని తాను పింఛన్ ఎలా తెచ్చుకోవాలని టీడీపీపై ఆక్రోశం వ్యక్తం చేస్తోంది.



సచివాలయ వ్యవస్థలో అంతర్భాగమైన వలంటీర్ల నిస్వార్థ సేవలకు రాజకీయ రంగు పులిమి సేవా బంధాన్ని విచ్ఛిన్నం చేసింది పచ్చ పార్టీ. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను పారదర్శకతతో పాటు అవినీతి, అక్రమాలు లేకుండా నేరుగా లబ్ధిదారుల చెంతకు చేర్చుతున్న వలంటీర్లను ప్రజలకు దూరం చేసింది. కరోనా వేళ ఆత్మబంధువులా సేవలందించిన వారి పట్ల టీడీపీ నేతలు నిరాధారణ ఆరోపణలు చేసి అడుగడుగునా అవమానించారు. చివరకు ఓ సంస్థను అడ్డం పెట్టుకుని హైకోర్టులో పిటిషన్ వేయించి పింఛన్ల పంపిణీతో సహా అన్ని నగదు పంపిణీ ప్రయోజనాలకు దూరంగా చేయడంతో పింఛన్ లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. మానవత్వం మరిచి టీడీపీ నేతలు ప్రవర్తిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎండా కాలంలో క్యూలో ఎలా నిలవాలి



చిత్రంలో కనిపిస్తున్న వృద్ధుడు పేరు చిన్న సుబ్బయ్య. కోవెలకుంట్ల మండలం వల్లంపాడుకు చెందిన ఇతను చిన్నతనంలోనే పోలియో బారిన పడ్డాడు. ఒక కాలు పూర్తిగా నడటానికి రాదు. ప్రతి నెలా దివ్యాంగ పింఛన్ వస్తోంది. గతంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు అతి కష్టంగా వెళ్లి పింఛన్ తీసుకునేవాడు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వలంటీర్లతో ఇంటి వద్దనే పింఛన్ అందుతుండటంతో ఐదేళ్ల పాటు ఎలాంటి కష్టం లేకుండా పింఛన్ పొందాడు. ఈ నెల నుంచి మళ్లీ పింఛన్ తీసుకునేందుకు ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లాల్సి రావడంతో ఆందోళన చెందుతున్నాడు. పింఛన్లు పొందేందుకు పాత రోజులు పడిన కష్టాలు గుర్తు తెచ్చుకుని కంట తడి పెట్టాడు.



కరోనా విపత్తులో కోవెలకుంట్లలో వృద్ధురాలికి భోజన ప్యాకెట్ అందజేస్తున్న వలంటీర్ మీనాకుమారి

కోవెలకుంట్ల: గ్రామ స్వరాజ్యం దిశగా అడుగులు వేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 2019 ఆగస్టు నెలలో వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. నంద్యాల జిల్లాలో 9,017 మంది గ్రామ, వార్డు వలంటీర్ పోస్టులు ఉన్నాయి. ఇందులో 190 పోస్టులు ఖాళీగా ఉండగా ప్రస్తుతం 8,827 మంది వలంటీర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ ఫలాలను కుల, మల, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా గడప వద్దకు చేర్చారు. కరోనా కష్టకాలంలో వలంటీర్లు కరోనా వారియర్స్‌గా పనిచేశారు. 55 నెలల నుంచి వలంటీర్లు వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, చేనేతలు, తదితర లబ్ధిదారులకు ప్రతి నెలా 1వ తేదీన తెల్లవారుజామునే క్రమం తప్పకుండా ఇంటివద్దనే పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. జిల్లాలోని 29 మండలాల పరిధిలో 2,23, 598 మంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత, డప్పు, చర్మకళాకారులున్నారు. వీరికి ప్రతి నెల రూ. 66.44 కోట్లను పింఛన్ల రూపంలో అందజేస్తున్నారు. గత నెల 16వ తేదీన 2024 సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. కోడ్ అమల్లో ఉన్నా పింఛన్ల పంపిణీకి ఆటంకం లేకుండా నియమ నిబంధనల ప్రకారం వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే మొదటి నుంచి వలంటీర్ల వ్యవస్థపై కక్ష పెంచుకున్న చంద్రబాబు తన వారితో ఫిర్యాదు చేయించి ఎన్నికల సంఘం ద్వారా వలంటీర్ల నుంచి పింఛన్ల పంపిణీ అడ్డుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో సచివాలయాల్లోనే పింఛన్లు తీసుకోవాల్సి వస్తుండటంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. మంచానికి పరిమితమైన వృద్ధులు, దివ్యాంగులు, బుద్ధిమాంద్యం ఉన్న వారు, దీర్ఘకాలిక రోగాలు ఉన్న వారి పరిస్థితి ఎలా అంటూ భయపడుతున్నారు. ప్రతి నెలా వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి తలుపు తట్టి పింఛన్లు అందజేసేవారని, ఈ నెల నుంచి ఎన్నికలు ముగిసే వరకు వలంటీర్లు అందుబాటులో లేకపోవడంతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇప్పటి వరకు 10 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. జిల్లా వ్యాప్తంగా 9వేల క్లస్టర్లు ఉండగా ఇప్పటి వరకు 6 వేల కస్టర్ల నుంచి సెల్‌ఫోన్, సిమ్, డివైజ్, తదితర పరికరాలు అప్పగించినట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది.

కళ్ల ముందు నాటి రోజులు..
గత టీడీపీ హయాంలో లబ్ధిదారులు పింఛన్లు పొందేందుకు పడే కష్టాలు అన్నీ ఇన్నీ కావు. పంచాయతీ, మున్సిపల్ కార్యాలయాల వద్ద గంటల తరబడి నిరీక్షించి పింఛన్లు తీసుకోవాల్సిన పరిస్థితి. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, తదితర పింఛన్ లబ్ధిదారులు 1వ తేదీ ఉదయమే పంచాయతీ కార్యాలయం వద్దకు వచ్చి పింఛన్లు పంచే సిబ్బంది కోసం వేచి ఉండేవారు. వృద్ధులు, దివ్యాంగులు సైతం ఎంతసేపైనా క్యూలో నిలబడాల్సిందే. సర్వర్ పనిచేయక, సిబ్బంది సమయానికి రాక లబ్ధిదారులు తిండి తిప్పలు మాని పింఛన్ల కోసం ఎదురు చూడాల్సి వచ్చేది. తాగేందుకు నీరు దొరక్క వృద్ధులు స్పృహ కోల్పోయిన సందర్భాలు కోకొల్లలు. పంచాయతీ కార్యాలయాల వద్ద లబ్ధిదారుల రద్దీని చూసి పింఛన్లు తీసుకోక ఎంతో మంది వెనక్కు వెళ్లిన సందర్భాలు ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రతి నెలా లబ్ధిదారులకు ఇళ్ల వద్దనే ఠంచన్‌గా పింఛన్లు అందించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో చంద్రబాబు అవ్వాతాతలపై తన ప్రతాపం చూపించాడు. వలంటీర్ల నుంచి పింఛన్లు అందకుండా చంద్రబాబు చేసిన నిర్వాకంతో గత టీడీపీ ప్రభుత్వ హయాంలోని రోజులు పునరావృతం కానున్నాయి.



సాదరదిన్నెలో మునెమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కౌసర్(ఫైల్)

చంద్రబాబుకు మానవత్వం లేదు



30 సంవత్సరాల క్రితం నా భర్త చనిపోవడంతో అప్పటి నుంచి వితంతు పింఛన్ వస్తోంది. గ్రామ పంచాయతీ కార్యాలయంలో మెట్టుపల్లె ఉండటంతో గతంలో నడుచుకుంటూ, ఆటుగా వెళుతున్న ఆటోలు, ట్రాక్టర్లలో వెళ్లి పింఛన్ తీసుకోవాల్సి వచ్చేది. జగనన్న వచ్చిన తర్వాత వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి ప్రతి నెల 1వ తేదీ తెల్లవారుజామునే తలుపు తట్టి పింఛన్ ఇస్తున్నారు. ఈ నెల నుంచి గ్రామ సచివాలయం వెళ్లి పింఛన్ తీసుకోవాలని చెబుతున్నారు. నెలన్నర క్రితం కాలు విరిగి మంచాన పడ్డాను. విరిగిన కాలుతో మెట్టుపల్లెలో ఉండే గ్రామ సచివాలయానికి ఎలా వెళ్లి పింఛన్ తీసుకోవాలి. చంద్రబాబునాయుడికి మానవత్వం లేదు. మాలాంటి అవ్వా, తాతలపై కక్ష కట్టడం సరికాదు.
– ఎర్రన్నగారి నాగమ్మ, వితంతువు, రామవరం, అవుకు మండలం

కరోనాలో ప్రాణాలకు తెగించి సేవలందించారు



కరోనా సమయంలో వలంటీర్లు ప్రాణాలకు తెగించి మాకు ఇంటికి వచ్చి పింఛన్‌లు ఇచ్చారు. అంతే కాకుండా ప్రభుత్వ పథకాలకు సంబంధించి సమాచారం, కరోనాపై జాగ్రత్తలు చెబుతూ వచ్చారు. అప్పట్లో వలంటీర్లు లేకుంటే ఎన్నో సమస్యలు వచ్చేవి. కరోనా ప్రపంచ మంతా భయపెట్టినా ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో కుటుంబాలు ఉన్నా లెక్క చేయక సేవ చేశారు. వలంటీర్లు అందించిన సేవలు ఎప్పటికీ మర్చిపోలేం.
– రామసుబ్బమ్మ, బందార్లపల్లె, కొలిమిగుండ్ల మండలం

మా శాపం చంద్రబాబుకు తగులుతుంది



వలంటీర్ల ద్వారా ఇంటి తలుపు తట్టి పింఛన్ ప్రభుత్వం ఇచ్చేది. ఎలక్షన్లు ఉంటే వలంటీర్ల ద్వారా పింఛన్లు ఇవ్వొద్దని చంద్రబాబు నాయుడు తన మనషుల ద్వారా కోర్టును ఆశ్రయించడం దారుణం. నేను వికలాంగుడిని సచివాలయం వద్దకు వెళ్లి ఎలా తీసుకోవాలి. క్యూలో నిలబడి తీసుకోవాలంటే ఎంతో ఇబ్బందిగా ఉంటుంది. చంద్రబాబు ఆలోచించకుండా ఇంటికి వచ్చే పింఛన్లు అడ్డుకోవడం దుర్మార్గం. చంద్రబాబుకు మా శాపం కచ్చితంగా తగులుతుంది. పింఛన్లు తీసుకుంటున్న పేదల ఉసురు తగ్గిలి చంద్రబాబు నాశనమవుతారు.
– మాబాషా, బీఎస్‌ఎస్‌ఆర్ నగర్. నందికొట్కూరు

ఉగాది మహోత్సవాలకు మెరుగైన ఏర్పాట్లు

- వైద్య శిబిరాలకు ప్రాధాన్యత ఇవ్వండి
- కన్నడ భక్తులకు సౌకర్యాలు కల్పించండి
- కలెక్టర్ శ్రీనివాసులు



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు, చిత్రంలో ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

నంద్యాల: శ్రీశైల మహాపుణ్య క్షేత్రంలో ఈనెల 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నిర్వహించే ఉగాది మహోత్సవాలకు తరలివచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు దేవస్థానం, సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఉగాది మహోత్సవాలపై జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలాంటి చిన్న సంఘటనలకు తావివ్వకుండా శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలన్నారు. వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజుకు తీవ్రతరమవుతున్న నేపథ్యంలో కర్ణాటక నుంచి వచ్చే కన్నడ భక్తులు వడెబ్బకు గురి కాకుండా అన్ని రకాల ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ఎంట్రీ పాయింట్ నుంచి శ్రీశైలం చేరే వరకు అవసరమైన అన్ని ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. వెంకటాపురం నుంచి శ్రీశైలం వరకు వచ్చే పాదయాత్ర భక్తులకు అటవీ మార్గంలో గుర్తించిన మార్గమధ్యలో 13 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన మందులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ హటకేశ్వరం వద్ద ఉన్న దుకాణాలను వెనక్కి తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తాగునీటి కోసం దేవస్థాన పరిధిలో ఏర్పాటుచేసిన సింటెక్స్ ట్యాంకుల వద్ద భక్తులు స్నానాలు చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తుల రద్దీ కనుగుణంగా మొబైల్ టాయిలెట్లు, షవర్ బాతులు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఈఓ పెద్దిరాజు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఉగాది ఉత్సవాల కోసం చేస్తున్న ఏర్పాట్లను వివరించారు. సమావేశంలో డీఆర్‌ఓ పద్మజ, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, డీసీహెచ్‌ఎస్ జఫ్రుల్లా , డీపీఓ మంజులవాణి తదితరులు పాల్గొన్నారు.

రూ.50 వేలు మించితే ఆధారాలు తప్పనిసరి
సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండటంతో రూ.50 వేలు మించి నగదుతో ఎక్కడికైనా వెళ్లాల్సి వస్తే నగదుకు సంబంధించి రసీదు, ఆధారాలు తప్పనిసరిగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని వ్యాపార సంఘాలు, ట్రేడ్ యూనియన్లతో సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ పద్మజ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా 29 రకాల వస్తువులు అధిక సంఖ్యలో కొనుగోలు చేసి డిస్ట్రిబ్యూషన్ జరిగితే సంబంధిత వస్తువులను సీజ్ చేస్తామన్నారు. రూ.20 లక్షల వార్షిక టర్నోవర్ కలిగిన వ్యాపారస్తులు సర్వీసెస్, అలాగే రూ.40 లక్షల వార్షిక టర్నోవర్ కలిగిన వ్యాపారస్తులు గూడ్స్‌పై తప్పనిసరిగా జీఎస్టీ రిజిస్ట్రేషన్ తీసుకోవాలన్నారు. వ్యాపార సంబంధిత నగదు రవాణా చేస్తే టాక్స్ ఇన్ వాయిస్, బిల్లు డెలివరీ, చలానా పేమెంట్ ఓచర్స్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అధిక మొత్తంలో నగదు, మద్యం, ఓటర్లను ప్రలోభపర్చే సామగ్రి అక్రమ తరలింపుపై పూర్తి స్థాయిలో నిఘా ఉంటుందన్నారు. ఈ అంశానికి సంబంధించి ఐటీ, జీఎస్టీ, పోలీస్, ఎక్సైజ్ తదితర 22 ఎన్‌ఫోర్సుమెంట్ ఏజెన్సీలు నిరంతరం పనిచేస్తున్నాయన్నారు. బ్యాంకు ఖాతాల ద్వారా అనుమానాస్పద, అధిక మొత్తంలో జరిగే లావాదేవీల వివరాలు ఎప్పటికప్పుడు ఆదాయపు పన్ను శాఖకు అందజేయాలన్నారు.

'పది' స్పాట్ వాల్యూయేషన్ ప్రారంభం
నంద్యాల(న్యూటౌన్): పాణ్యం సమీపంలోని ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం పదవ తరగతి స్పాట్ వాల్యూయేషన్ ప్రారంభమైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి పలు సబ్జెక్టులకు చెందిన దాదాపు 2 లక్షల జవాబు పత్రాలు జిల్లాకు వచ్చాయన్నారు. 120 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 720 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 200 మంది స్పెషల్ అసిస్టెంట్లను స్పాట్ వాల్యూయేషన్‌కు నియమించామన్నారు. 1040 ఎగ్జామినర్లకు అవసరమైన మంచినీటి వసతి, మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. పటిష్టమైన పోలీసు బందోబస్తు మధ్య స్పాట్ వాల్యూయేషన్ మొదటి రోజు ప్రశాంతంగా కొనసాగిందన్నారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకులు డాక్టర్ ప్రశాంతి

నంద్యాల(సెంట్రల్): ఆధునిక వ్యవసాయంపై రైతులకు అవగాహన అవసరమని, ఇందుకు జెడ్‌ఆర్‌ఈఏసీ సమావేశాలు చక్కని వేదికగా ఉపయోగపడతాయని ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకులు డాక్టర్ ప్రశాంతి అన్నారు. సోమవారం ఆమె అధ్యక్షతన స్థానిక కలెక్టరేట్ సెంటనరీ హాలులో ప్రాంతీయ పరిశోధనా విస్తరణ సలహా మండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విస్తరణ సంచాలకులు డాక్టర్ కేఎస్‌ఎస్ నాయక్, ఆర్ఏఆర్ఎస్ సహ సంచాలకురాలు డాక్టర్ సరళమ్మ మాట్లాడుతూ బెట్ట యాజమాన్యం, యాంత్రీకరణ సమీకృత వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. ఈ సంవత్సరం వైవిధ్యమైన వాతావరణ పరిస్థితుల వల్ల దిగుబడులు తక్కువగా నమోదైనట్లు పేర్కొన్నారు. మిరపలో నల్లతామర పురుగు, పత్తిలో గులాబీ రంగు పురుగు యాజమాన్యంపై రైతాంగానికి విస్తృతంగా అవగాహన కలిగించారన్నారు. వాతావరణ ఆధారిత సూచనలు, విత్తనోత్పత్తి చేపట్టాలని వేరుశనగతో పాటు, ఆముదం వంటి వాటిపై రైతాంగం మొగ్గు చూపాలని సూచించారు. కార్యక్రమంలో నంద్యాల, కర్నూలు అనంతపురం, సత్యసాయి జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులు మోహన్ రావు, వరలక్ష్మి, ఉమామహేశ్వరమ్మ, సుబ్బారావు, బోర్డు మెంబర్లు మురళీధర్ రెడ్డి జయలక్ష్మి, శాస్త్రవేత్తలు మంజునాథ్, రవి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో భూ బకాసురులు

- ల్యాండ్ సెటిల్‌మెంట్లు, కబ్జాలు, దందాలతో రెచ్చిపోతున్న టీడీపీ నేతలు
- గతంలో ఓ ల్యాండ్ వివాదంలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అరెస్ట్
- తాజాగా ఆ పార్టీ సీనియర్ నేత మాండ్రకు బిగుస్తున్న ఉచ్చు



సాక్షి, నంద్యాల: తెలుగుదేశం పార్టీ నేతలు భూబకాసురుల అవతారం ఎత్తారు. భూమి కనిపిస్తే చాలు కబ్జాకు పాల్పడుతున్నారు. వీరి ఆగడాలు పక్క రాష్ట్రం తెలంగాణకు చేరాయి. దర్జాగా ల్యాండ్ కబ్జాలు, సెటిల్‌మెంట్లు, దందాలకు పాల్పడుతూ రాష్ట్ర పరువు తీస్తున్నారు. హైదరాబాద్ కేంద్రంగా వీరి దందాలు రోజురోజుకు శ్రుతిమించిపోతున్నాయి. సెటిల్‌మెంట్ల పేరుతో భూములను తక్కువ ధరలకు కాజేస్తూ రూ. కోట్లు సంపాదిస్తున్నారు. ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి భూమా అఖిలప్రియ 2021లో హైదరాబాద్‌లో ఏకంగా అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి సమీప బంధువు ప్రవీణ్ రావును కిడ్నాప్ చేయించారు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సమయంలో పోలీసులకు విస్తుగొలిపే నిజాలు వెలుగులోకి వచ్చాయి. హైదరాబాద్‌లోని హాఫీజ్‌పేటలో రూ.వందల కోట్ల విలువైన ల్యాండ్ వివాదం సెటిల్‌మెంట్‌కు దారి తీసింది. సెటిల్‌మెంట్‌కు ప్రవీణ్ రావు ఒప్పుకోకపోతే ఆయన్ను అఖిలప్రియ కిడ్నాప్‌నకు యత్నించారు. ఈ కేసులో అఖిలప్రియను ఏ1గా, ఆమె భర్త భార్గవ్‌రామ్‌ను ఏ3గా గుర్తించారు. ఇదే కేసు విషయమై అఖిలప్రియను తెలంగాణ పోలీసులు అరెస్ట్ కూడా చేశారు. అలాగే ఈ కేసులో టీడీపీ నేత ఏవీ సుబ్బారెడ్డి కూడా ఉన్నారు. గతేడాది మే నెలలో నంద్యాలలో నారా లోకేశ్ నిర్వహించిన యువగళం పాదయాత్రలో కొత్తపల్లి వద్ద సొంత పార్టీ నేత ఏవీ సుబ్బారెడ్డిపైనే మాజీ మంత్రి అఖిలప్రియ దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఏవీ సుబ్బారెడ్డి గాయపడ్డారు. ఈ ఘటనలోనూ అఖిలప్రియపై కేసు నమోదైంది. ఇలా భూ కబ్జాలు, కిడ్నాప్‌లు, దాడులు టీడీపీ నేతలకు పరిపాటిగా మారాయి.

అసైన్డ్ భూముల కేసులో మాండ్ర....
టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా ఉన్న మాండ్ర శివానందరెడ్డి కూడా భూ కబ్జా కేసు ఇరుక్కున్నట్లు తెలుస్తోంది. మొన్నటి వరకు టీడీపీ తరఫున నంద్యాల ఎంపీ టికెట్ తనకే అంటూ ప్రచారం కూడా చేసుకున్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలో ఆయన ప్రధాన అనుచరుడికే ఎమ్మెల్యే టికెట్ దక్కించుకున్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు ఉన్నతాధికారిగా ఉన్న సమయంలో భారీగా భూ కబ్జాలకు పాల్పడినట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. గతంలో కబ్జా చేసిన భూములు ఇప్పుడు రూ. వేల కోట్లు పలుకుతున్నాయి. హైదరాబాద్ శివారు ప్రాంతమైన బుద్వేల్‌లో దాదాపు 29 ఎకరాల అసైన్డ్ భూమిని ఆయన కబ్జా చేశారన్నది ప్రధాన ఆరోపణ. ప్రస్తుతం ఈ భూముల విలువ రూ.2 వేల కోట్లకు పైమాటేనని తెలుస్తోంది. ఈ భూములను ఆయన తన భార్య, ఇతర బంధువుల పేర్ల మీద ఉన్నట్లు సమాచారం. ఇదే కేసు విషయమై సోమవారం తెలంగాణ సీసీఎస్ పోలీసులు నందికొట్కూరుకు చేరుకున్నారు. నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామంలోని మాండ్ర స్వగృహానికి తెలంగాణ సీసీఎస్ పోలీసులు చేరుకుని.. అసైన్డ్ ల్యాండ్ కబ్జా విషయమై తాము చేస్తున్న దర్యాప్తునకు సహకరించాలని కోరారు. కానీ, పోలీసుల కళ్లుగప్పి మాండ్ర తప్పించుకుని పారిపోయారు.

భయపడుతున్న జిల్లా వాసులు..
తెలుగుదేశం పార్టీ నేతల భూ కబ్జాలు, సెటిల్‌మెంట్లు విన్న ప్రతి సారి జిల్లా ప్రజలు ఉలిక్కిపడుతున్నారు. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న సమయంలో వీరు చేసిన అరాచకాలను తలుచుకుని ఇప్పటికీ భయపడుతున్నారు. అధికారంలో లేకపోయినా కబ్జాలకు పాల్పడుతుంటే.. మళ్లీ వీరికి అధికారం అప్పగిస్తే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో తలుచుకుంటేనే భయమేస్తోందని జిల్లా వాసులు ఆందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

భూమా అఖిలప్రియపై కేసు నమోదు

ఉయ్యాలవాడ: సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా కోడ్ ఉల్లంఘించిన ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియపై ఉయ్యాలవాడ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదయింది. ఎస్‌ఐ రామాంజనేయులురెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మార్చి 28వ తేదీన ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉదయం 11.30 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు టీడీపీకి అనుమతులు ఇచ్చారు. అయితే ఇందుకు భిన్నంగా అదే రోజు రాత్రి 8.15 నుంచి 9.00 గంటల వరకు స్థానిక బస్టాండు నుంచి డప్పుల మోతతో టీడీపీ నాయకులు బోరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఇంటి వరకు అనుమతి లేకుండా భూమా అఖిలప్రియ ర్యాలీ నిర్వహించారు. మోడల్ కండక్ట్ నిర్వహణ అధికారి రఘురాం ఫిర్యాదు మేరకు ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ స్పష్టం తెలిపారు.

ఆర్‌యూ ప్రొఫెసర్ ఎస్తేర్ రాణిపై విచారణ

కర్నూలు కల్చరల్: ఆర్‌యూ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ నిధుల గోల్‌మాల్‌కు పాల్పడి సస్పెన్షన్‌లో ఉన్న వర్సిటీ ప్రొఫెసర్ ఎం.ఇ.ఎస్తేర్ రాణిపై సోమవారం వర్సిటీలో విచారణ జరిగింది. నెల్లూరు విక్రమసింహపురి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రారెడ్డి, రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ నాగుల అంకన్న, వర్సిటీ ఫైనాన్స్ ఆఫీసర్ కొడాలి భవాని శంకర్‌లతో కూడిన కమిటీ ఈ విచారణ చేపట్టింది. ప్రొఫెసర్ రాణి విచారణ కమిటీ ముందు హాజరై వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. తర్వాత నివేదికను షీల్డ్ కవర్‌లో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్‌కు, రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బి.సుధీర్‌కుమార్‌కు అందజేశారు. రెండు మూడు రోజుల్లో కమిటీ రిపోర్ట్ బయటికి వస్తుందని, దానిని బట్టి చర్యలు తీసుకుంటామని వీసీ పేర్కొన్నారు.

శిక్షణకు గైర్హాజరైన అధికారులకు నోటీసులు

కర్నూలు (సెంట్రల్): మార్చి 30, ఏప్రిల్ 1వ తేదీన ఎంఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఎన్నికల విధుల నిర్వహణ శిక్షణకు హాజరుకాని పీఓలు, ఏపీఓలకు జిల్లా ఎన్నికల అధికారి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. మార్చి 30వ తేదీన 44 మందికి, ఏప్రిల్ 1వ తేదీన జరిగిన శిక్షణకు హాజరు కాని 26 మందికి మొత్తం 70 మందికి నోటీసులు ఇచ్చి ఎందుకు హాజరు కాలేదో మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు.

హెచ్‌టీ విత్తనాల ఏరివేతపై దృష్టి

● కాటన్ సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లలో ముమ్మరంగా తనిఖీలు



హెచ్‌టీ పత్తి విత్తనాలను గుర్తించేందుకు పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖ కమిషనరేట్ నుంచి వచ్చిన ప్రత్యేక టీమ్ కర్నూలు నగరంలోని పలు కాటన్ సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లలో తనిఖీలు నిర్వహించింది. ప్రధానంగా పత్తిలో హెచ్‌టీపై ఈ టీమ్ దృష్టి సారించింది. హెచ్‌టీ కాటన్ విత్తనాలకు ఎలాంటి అనుమతులు లేవు. అయితే, అక్కడక్కడ హెచ్‌టీ పత్తి సాగు చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. హెచ్‌టీ పత్తి సాగు జీవ వైవిధ్యానికి, పర్యావరణానికి తీవ్రంగా హాని చేస్తాయనే ఉద్దేశంతోనే అనుమతి ఇవ్వలేదు. కమిషనరేట్ నుంచి వచ్చిన ప్రత్యేక టీమ్ ఏడీఏ సుదర్శన్‌రాజు, ఏఓ శివశంకర్ సోమవారం పలు పత్తి విత్తన కంపెనీల్లో తనిఖీలు చేపట్టారు. శ్రీరామ సీడ్స్, కర్నూలు సీడ్స్, సహజ క్రాప్ సైన్స్, మహాలక్ష్మి కాటన్‌సీడ్స్, సూపర్ సీడ్స్ కంపెనీల్లో హెచ్‌టీ పరీక్షలు నిర్వహించారు. ఈ కంపెనీల్లో అక్కడికక్కడే 50 శ్యాంపుల్స్ తీసి పరీక్షలు నిర్వహించారు. అయితే హెచ్‌టీ ఉన్నట్లు నిర్ధారణ కాలేదు. అన్ని శ్యాంపిల్స్ నెగిటివ్ వచ్చాయి. టీమ్ ప్రతినిధుల వెంట కల్లూరు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి కూడా ఉన్నారు.



పల్లకీతో శ్రీశైలం వెళ్తున్న కన్నడిగులు



భజన చేస్తూ మల్లన్న చెంతకు..



కావడి మోస్తూ..



దప్పు కొట్టుకుంటూ..



కాళ్లకు కర్రలు కట్టుకుని పయనం



శరణమప్ప శివప్ప

శ్రీశైల భ్రమరాంబికను కన్నడ ప్రాంత వాసులు తమ ఆడపడుచుగా భావిస్తారు. ఉగాది పండుగకు అమ్మవారికి సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. కర్ణాటక రాష్ట్రం బళ్లారి, రాయచూరు, గడేకల్లు, పెంచర్లపాడు, దోనేకల్లు, చేవిదుర్గి, అగిరి, జోజరాశి, పర్వదేమనల్లి, కక్కబేవదల్లి, కమ్మరచేడు గ్రామాల మీదుగా వీరు కాలినడక 400 కిలోమీటర్ల దూరం ప్రయాణించి శ్రీశైలం చేరుకుంటారు. వీరి భక్తికి మండే ఎండలు సైతం చిన్నబోవాల్సిందే! కొందరు పొడవాటి కర్రలను కాళ్లకు కట్టుకుని .. మరికొందరు చిన్న పల్లకీని భుజాన ధరించి నడుస్తున్నారు. ఇంకొందరు అఖండ దీపాలను శ్రీగిరికి తీసుకెళ్తూ కనిపించారు. – సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు



ఆటోపై శివలింగంతో..



అడుగడుగునా భక్తి పారవశ్యం



గార్గేయపురం చెరువు వద్ద స్నానం చేస్తూ..



జొహరాపురంలో భక్తులకు అన్నదానం



లారీలో పిల్లాపాపలతో శ్రీగిరికి..

క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుడి అరెస్ట్

● రూ.3 లక్షలు నగదు, రెండు సెల్‌ఫోన్‌లు, 5 లీటర్ల నాటుసారా స్వాధీనం

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని ధణాపురం గ్రామ సమీపంలో నాటుసారా అమ్ముతూ ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. రూ.3 లక్షలు నగదు, రెండు సెల్‌ఫోన్లు, 5 లీటర్ల నాటుసారాయిని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ శివనారాయణస్వామి వివరాలు వెల్లడించారు. బోయగేరికి చెందిన బోయ కుంటి ఆంజనేయులు నాటుసారా అమ్ముతుండేవాడు. ఐపీఎల్ క్రికెట్ జరుగుతుండడంతో అందులో భాగంగా సోమవారం ముంబాయి వర్సెస్ రాజస్థాన్ ఆటకు సంబంధించి క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. పక్కా సమాచారం మేరకు పట్టణ సమీపంలోని ధణాపురం శివారులో పాడుపడిన ఇందిరమ్మ గృహాల వద్ద బోయ కుంటి ఆంజనేయులను సీఐలు తేజోమూర్తి, గోపీ, నరసింహరాజు, నిరంజన్ రెడ్డి అరెస్ట్ చేశారు. బెట్టింగ్‌లో మరికొంతమంది ఉండడంతో వారిపై కూడా కేసు నమోదు చేశామని డీఎస్పీ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

జవహర్ నవోదయ ఆరో తరగతి ప్రవేశ పరీక్షా ఫలితాలు విడుదల

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరవ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన ఫలితాలను విడుదల చేసినట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ ఇ.పద్మావతి సోమవారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు.

ఐ1089741	ఎస్1091314	జె1091503
ఎం1091511	కె1093024	జె1094342
కె1094536	జె1089610	ఎస్1089751
ఎస్1090029	జె109269	ఎఫ్1093950
ఓ1091304	కె1091906	ఓ1092626
కె1094865	ఐ1090927	జె1091260
బి1092566	ఎల్1093626	జె1088970
జె1088988	ఎస్1089197	జె1089224
జె1089434	జె1089821	ఐ1090039
ఎం1090209	జె1090548	ఎం1090996
ఎస్1091226	జె1091236	ఎస్1091351

ఎం1091536	జె1091703	జె1091969
జె1092815	జె1092873	ఎం1093047
ఐ1093170	జె1093478	కె1093504
జె1093703	ఎస్1093824	జె1093917
ఐ1094250	ఎం1094733	జె1090261
జె1090270	జె1090320	జె1090335
ఎస్1090417	జె1090443	ఎస్1090491
జె1090574	ఎస్1091014	ఎస్1091589
జె1091659	జె1091662	జె1091699
జె1091988	జె1092700	ఎస్1094387
కె1089207	కె1089899	ఓ1090351
కె1090476	కె1090994	ఓ1091444
జె1091964	కె1091980	కె1093032
ఓ1093803	కె1094633	పి1090497
పి1090645	ఎల్1090701	ఎల్1090825
పి1093774.		

నల్లమల ఘాట్‌లో ట్రాఫిక్ జామ్

● అర్ధరాత్రి తర్వాత రాకపోకలు

మహానంది: నంద్యాల నుంచి గిద్దలూరు వెళ్లే నల్లమల ఘాట్‌రోడ్డులో గుంటూరు వైపు నుంచి మిర్చి లోడుతో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తూ సోమవారం సాయంత్రం 5.30 గంటల సయంలో రక్షణగోడను ఢీకొట్టింది. దీంతో లారీ రోడ్డుపైనే నిలిచిపోయి వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. అసలే మండుటెండలు, ఆపై నల్లమల కావడంతో తాగడానికి మంచి నీళ్లు సైతం లేక అల్లాడిపోయారు. రహదారిపై నిలిచిన లారీని పక్కకు తప్పించేందుకు రోడ్‌సేఫ్టీ పోలీసులు ఘటనా స్థలానికి తీసుకెళ్లిన క్రేన్ మరమ్మతుకు గురికావడంతో మరో క్రేన్ కోసం నంద్యాలకు వెళ్లి తీసుకొచ్చేసరికి ఆలస్యమైంది. సోమవారం అర్ధరాత్రి తర్వాత వాహనాన్ని పక్కకు తీశారు. దీంతో వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.



రక్షణ గోడను ఢీకొట్టిన లారీ

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

● మరో ఇద్దరి పరిస్థితి విషమం

మంత్రాలయం: రచ్చమర్రి సమీపంలోని విజయదుర్గ ఆలయం వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృత్యువాత పడగా మరో ఇద్దరు తీవ్ర గాయాల పాలయ్యారు. ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాలకు మేరకు.. కోసిగిలోని సిద్ధపాళెం ప్రాంతానికి చెందిన శ్రీనివాస ఆచారి, ఈశ్వరమ్మ రెండో కుమారుడు మౌనేష్ ఆచారి కర్ణాటకలోని రాయచూరులో బంగారుషాపులో కంసలి పని చేస్తున్నారు. ఆదివారం సెలవుకావడంతో స్నేహితులు సూరిపోగు ఉరుకుంద, శ్రీకాంత్ ఆచారితో కలిసి సొంత పనుల నిమిత్తం మోటార్ సైకిల్‌పై రాయచూరు వెళ్లారు. ఆదివారం రాత్రి బైకుపై వేగంగా తిరిగి వస్తూ ప్రమాదానికి గురయ్యారు. మౌనేష్ ఆచారి అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. సూరిపోగు ఉరుకుంద కోమాలోకి వెళ్లగా కర్నూలు పెద్దాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మరో యువకుడి పరిస్థితి కూడా విషమంగా ఉందని బంధువులు తెలిపారు. మౌనేష్ ఆచారికి ఏడాది క్రితం పెళ్లి జరిగింది. మౌనేష్ మృతదేహానికి ఆదోని ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. అనుకోకుండా చిన్నకుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.



మృతుడు మౌనేష్ ఆచారి (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

డోన్ రూరల్ : డోన్ – రాయలచెరువు రహదారిలో గోసానిపల్లి గ్రామ సమీపంలో సోమవారం ఆటో, కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఊటకొండ గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు(45), సురేష్ ఇంటి నిర్మాణానికి అవసరమైన సిమెంట్ కోసం ఆటోలో డోన్ పట్టణానికి వచ్చారు. సిమెంట్ వేసుకొని తిరిగి వెళ్తుండగా గోసానిపల్లి గ్రామం వద్ద ఎదురుగా డోన్ వైపు వస్తున్న కారు ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందగా, గాయపడిన సురేష్, ఆటో డ్రైవర్ మంజునాథ్‌ను డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. అలాగే కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతునికి భార్య లక్ష్మీదేవి, కూతురు, కొడుకు ఉన్నారు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆశాజనకంగా ఎండుమిర్చి ధరలు

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని మిర్చి యార్డులో ఎండుమిర్చి ధరలు సోమవారం ఆశాజనకంగా ఉన్నాయి. సూపర్–10 సరకు రకం అమ్మకానికి వచ్చాయి. సూపర్–10 రకం జనరల్ క్వింటాలు గరిష్ట ధర రూ.14,300, మధ్యస్థ ధర రూ.12,900, కనిష్ట ధర రూ.12,000 గా నమోదైంది. ఇదే రకం తాలుకాయ జనరల్ గరిష్ట ధర క్వింటాలు రూ.6,200, మధ్యస్థ ధర రూ.5,500, కనిష్ట ధర రూ.4,500 గా పలికినట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా యార్డులోని ధ్రువీకృత వ్యాపారస్తుల వద్ద సరకు అమ్ముకొని మంచి ధరను పొందాలని సూచించారు.

కాలినడక భక్తులు జాగ్రత్తలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): కాలినడకన శ్రీశైలం వెళ్లే భక్తులు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ సూచించారు. సోమవారం ఆయన గోకులపాడులో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సందర్శించి భక్తులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కర్ణాటక, మహారాష్ట్రల నుంచి దీక్షతో 600 నుంచి 800 కి.మీ దూరం పాదయాత్ర చేస్తూ భక్తులు శ్రీశైలం చేరుకుంటారన్నారు. వీరందరినీ అతిథులుగా భావించి అన్నదానం కార్యక్రమాలు విరివిగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఎండాకాలం అయినందున భక్తులకు పరిశుభ్రమైన నీటిని అందించాలన్నారు. కలుషితం కాకుండా చెంబులు, గ్లాసులు, మగ్గులు తాగు నీటిలో ముంచరాదన్నారు. శుభ్రమైన పాత్రలలో తాగునీటిని ఏర్పాటు చేసి వాటికి కుళాయి బిగించి వాడాలని సూచించారు. అవకాశం ఉంటే దాతల సహకారంతో మినరల్ వాటర్ ప్యాకెట్లు అందించాలన్నారు. వేడి వేడి ఆహార పదార్థాలు మాత్రమే భక్తులకు వడ్డించాలని దాతలకు సూచించారు. భక్తులు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిమ్మరసం, చక్కెర నీళ్ల ద్రావణం, మజ్జిగలో కొద్దిగా ఉప్పు కలిపి ఇవ్వాలన్నారు. ఎండలో నడిచే భక్తులు తలపై టోపీ గాని, టవల్ గానీ ధరించాలన్నారు. వడదెబ్బ తగిలితే సత్వర చికిత్స కోసం 108 అత్యవసర సేవలను సంప్రదించాలన్నారు.



భక్తులకు సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ ప్రవీణ్‌కుమార్

'మండే' ఎండలు!

కర్నూలు(అగ్రికల్చర్): వేసవి తీవ్రత పెరుగుతుండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. రాష్ట్రంలోనే ప్రధానంగా కర్నూలు జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం గమనార్హం. ఉదయం 10 గంటలకే మొదలైన వడగాలులు తీవ్రత సాయంత్రం 7 గంటల వరకు తగ్గని పరిస్థితి. ఏప్రిల్ నెల మొదటి రోజునే భానుడు విజృంభించాడు. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఇప్పటికే రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు ప్రకటించారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో బనగానపల్లిలో రాష్ట్రంలోనే అత్యధికంగా 43.48 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పాణ్యం మండలం గోనవరంలో 43.26, గూడూరులో 43.18, నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరులో 43.13, మహానందిలో 43.01, మంత్రాలయం మండలం వగరూరులో 43.0, హొళగుందలో 42.96 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇవన్నీ రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలే కావడం గమనార్హం. రానున్న నాలుగైదు రోజులు కూడా ఎండలు, వడగాలుల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది.

కూలి పనులకు వెళ్తూ మృత్యువాత

చిప్పగిరి: ఆటోలో నుంచి పడి ఓ మహిళ మృతి చెందింది. ఈ ప్రమాదం సోమవారం చిప్పగిరిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదోని మండలంలోని చాగి గ్రామానికి చెందిన లక్ష్మి చిప్పగిరిలోని పొలాల్లో మిరప పంట కోయడానికి తమ గ్రామ కూలీలతో కలసి ఆటోలో వచ్చింది. పొలం దూరంగా ఉండడంతో చిప్పగిరి గ్రామానికి చెందిన మరో ఆటోలో పొలానికి వెళ్తుండా అందులో నుంచి కిందపడి మృతి చెందింది. మృతురాలికి భర్త బసవరాజు, ముగ్గురు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహమ్మద్ రిజ్వాన్ తెలిపారు.

